# ఒకటి ఒంటరి అంకె

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



**1978 లో మల్లాది గారి కలం నుంచి వెలువడిన నవల**

*(గత సంచిక తరువాయి)*

**7**

**వర్ధనమ్మకు** ఆరోగ్యం సంతృప్తికరంగా లేదు ఆవిడకి హై బి.పి. ఎక్కువయింది. ఒకసారి గుండెపోటు స్వల్పంగా వచ్చి తగ్గింది. రోజూ ఒక కాంపోజ్ మాత్ర వేసుకుంటేనే గాని రాత్రిళ్ళు నిద్రపట్టదు.

త్రిపురానికి ఇంకా పెళ్ళికాలేదన్న బాధ. కొడుకు పొలం నుంచి వచ్చే శిస్తు వసూలు చేసుకోడానికి ఏడాదికి ఒక్కసారి కంటే రాడని తమంటే ఏమాత్రం ప్రేమ లేదనే దిగులు. సునీత సంసారం అలా అయిందనే వ్యధ. ఆవిడ అవన్నీ తనలోనే దాచుకుని బాధపడుతూ ఉంటుంది.

త్రిపురానికి ఓ కొత్త సంగతి తెలిసింది. సునీతకి తన భర్త రెండో పెళ్ళి చేసుకోడం ఎంతమాత్రం ఇష్టంలేదు. అన్ని విధాలా ఎదిరించింది. కాని ఆయన మాత్రం పిల్లలకోసం చేసుకుంటానని మొరాయించాడు.

అందుకు ఆయనవైపు బంధువుల బోధ ప్రధాన కారణం. సునీత నిస్సహాయురాలయింది. అలాంటి పరిస్థితులలో త్రిపురాన్ని అడిగింది జయరాంని చేసుకోమని. నిజం దాచింది. ఆ పెళ్ళికి దారి తీయించిన కారణం.

కాని త్రిపురం తిరస్కరించడంతో పూర్తిగా మానసికంగా దెబ్బతిన్నది. జయరామ్ దూరపు బంధువులలోని ఓ బీదపిల్లను చేసుకున్నాడు తిరుపతిలో నిరాడంబరంగా.

ఆ పెళ్ళికి వర్ధనమ్మ ఒకతే వెళ్ళివచ్చింది. పెళ్ళిలో సునీత రహస్యంగా తల్లితో చెప్పుకుని ఏడ్చింది.

వర్ధనమ్మ రెండుమూడుసార్లు వెళ్ళింది సునీత ఇంటికి. చూడటానికి అంతా బాగానే ఉన్నట్లున్నా, లోలోపల బాగా మధనపడుతోందని గ్రహించింది వర్ధనమ్మ.

సవతిపోరు ఒక్క ఆడదానికే అర్థమవుతుంది. అందులోని చేదుని అనుభవిస్తే గాని అర్థంగాదు.

నిజానికి రెండో పెళ్ళాం సవ్యంగా, సఖ్యతగా ఉన్నా, తన భర్త పూర్తిగా తనవాడు కాదు అన్న నిజం మరచిపోలేదు ఆడది. అది పట్టి పీడిస్తుంటుంది. ఒక విధమైన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఏర్పడుతుంది మొదటి భార్యలో.

మానసికంగా ముగ్గురిలో ఎదుగుదల అర్థం చేసుకునే శక్తి, సర్దుకు పోయే సామర్థ్యం, ఎదుటివారిని గౌరవంగా, ప్రేమగా చూసుకోగలిగే చతురత, ముగ్గురూ - కాదు - ఆ ఇద్దరూ హాయిగా బ్రతకగలరు.

సునీత కాపురంలో అగ్గి అంటుకుని మండుతోంది, అది త్రిపురం తన తల్లి బాధలో చూడగలుగుతోంది.

ఒక్కోసారి 'ఒప్పుకునివుంటే?' అనిపిస్తుంది వెంటనే. కేవలం పిల్లల్ని కనిచ్చే యంత్రమా తను? రేపు పెళ్ళయాక కూడా తను చేసే పని అదేగా?

అక్కయ్య అంటే మనసులో ప్రేమ ఎక్కువైంది త్రిపురానికి. కాని ఏం చేయలేని స్థితిలో ఉంది. సునీత త్రిపురం పేరు వింటేనే మండిపోతోందని తెలిసాక, అక్కయ్యకి క్షమాపణలు చెప్పుకోడానికి వాళ్ళింటికి వెళ్ళదలచుకోలేదు.

ఒక ఉత్తరం వ్రాసింది. కాని చదువుతుందనే నమ్మకం లేక చింపేసింది. ప్రేమకన్నా అక్కయ్యకంటే జాలి, సానుభూతే ఎక్కువ త్రిపురానికిప్పుడు.

✷✷✷

ఎం.ఏలో రామకృష్ణతో పరిచయం అయింది త్రిపురానికి. ఫస్టియర్ అంతా త్రిపురం ఎవరితో కలిసేది కాదు. సహజంగా ఉండే సిగ్గు, తను సెకండ్ వచ్చిందనే అహంభావం, ఇంట్లోని పరిస్థితులు మొదలైన వాటివల్ల మొగవాళ్ళకి దూరంగా ఉండిపోయింది.

కాని రెండో సంవత్సరంలో రామకృష్ణతో పరిచయం ఏర్పడింది త్రిపురానికి. కారణం అతనికి కూడా త్రిపురంలా చదువు మీద అపారమైన శ్రద్ధ. ప్రొఫెసర్స్‌కి కూడా అతనంటే ప్రత్యేకమైన అభిమానం, త్రిపురంలానే అతనూ రిజర్వ్‌డ్‌గా ఉంటాడు.

వాళ్ళిద్దరి మధ్యా ఎప్పుడూ సబ్జెక్టు గురించి తప్ప వేరే టాపిక్ వచ్చేదికాదు. ఎప్పుడైనా సినిమాల గురించి, అతనికి అభిరుచివున్న ఫోటోగ్రఫి గురించి మాట్లాడేవాడు. త్రిపురం కూడా తన తల్లిని గురించి, ఇంగ్లీష్ నవలల గురించి మాట్లాడుతుండేది.

త్రిపురం అతని లైబ్రరీ కార్డు తీసుకుని తనకి కావల్సిన పుస్తకాలు తీసుకునేది. త్రిపురం తయారుచేసిన నోట్స్ తీసుకునేవాడు రామకృష్ణ. వాళ్ళిద్దరి మధ్యా స్నేహం వారం వారానికి అధికం కాసాగింది. అయితే పరిపూర్ణంగా అది ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే స్నేహం మాత్రమే. యువతీ యువకుల మధ్య ఉండే స్నేహం కాదు. వాళ్ళిద్దరూ రెండు సెక్స్‌లకి సంబంధించిన వ్యక్తులవటం కాకతాళీయం అనిపిస్తుంది వాళ్ళ స్నేహం.

రామకృష్ణ త్రిపురం ఆడపిల్ల కాబట్టి ఆకర్షింపబడి స్నేహం చేసుకోలేదు. త్రిపురం కూడా అంతే. ఇద్దరి స్నేహానికి పునాది వాళ్ళకి చదువు మీదవున్న శ్రద్ధ.

వారిద్దరి మధ్యా ప్రచ్ఛన్నంగా పోటీకూడా ఉండేది. పరీక్షల్లో ఎవరికివారు తమకే మొదటి మార్కులు రావాలని తాపత్రయపడేవారు. ఫస్ట్, సెకండ్‌లు సాధారణంగా వారిద్దరినీ దాటి వెళ్ళేవికావు.

ఎం.ఏ ఫైనల్ ఇయర్ చివరలో ఒకరోజు త్రిపురం రామకృష్ణని ఇంటికి ఆహ్వానించింది. రామకృష్ణ త్రిపురం ఇంటికి వెళ్ళాడు. రీడర్స్ డయిజెస్ట్ ప్రత్యేకంగా ప్రచురించిన 'ది గ్రేట్ వరల్డ్ అట్లాస్' బహుమతిగా తీసుకెళ్ళాడు.

"దాంక్స్ ఎలాట్" అన్నది అందుకుని, దాని ఇండెక్స్ పేజీ మీద వ్రాసి ఉంది.

"ఫ్రెండ్ షిప్ అండ్ థర్స్టు ఫర్ నాలెడ్జ్ నోస్  నో బౌండ్స్ - హేపీ బర్త్‌డే".

త్రిపురం అప్పుడప్పుడూ స్నేహితులని ఇళ్ళకి ఆహ్వానిస్తూంటుంది, మొగవాళ్ళుకూడా ఉంటారు. వర్ధనమ్మ త్రిపురాన్ని వాళ్ళ గురించి ఎప్పుడూ ప్రశ్నించదు తనని పరిచయం చేస్తే మాట్లాడుతుంది. వెంటనే లోపలకి వెళ్ళి కాఫీ టిఫిన్ ఏర్పాటు చేసి మళ్ళీ వచ్చి కూర్చుంటుంది డ్రాయింగ్ రూంలో.

వర్ధనమ్మకి త్రిపురం జడ్జిమెంట్ మీద నమ్మకం అధికం. "మొగ స్నేహితులు ఎందుకు?" లాంటి ప్రశ్నలు వేయదు.

ట్రేలో స్వీట్స్, స్నాక్సు తీసుకువచ్చింది వర్ధనమ్మ.

"తీసుకోండి" అన్నది త్రిపురం.

"థాంక్సు. మీరూ తీసుకోండి" చెప్పాడు రామకృష్ణ.

"నో. ఇవాళ తినను."

"అదేమిటి? ఇవాళ మీ పుట్టినరోజుగా?"

"అయినా తినను."

"ఏం?"ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇవాళ మంగళవారం కనుక."

"మంగళవారం ?"

వర్ధనమ్మ చెప్పింది జవాబు.

"త్రిపురం నాన్నగారు మంగళవారం పోయారు. అప్పటినుంచి మంగళవారం ఏం తినం. అలా అలవాటైంది మాకు."

"ఓ ఐ యాం సారీ." అని అడిగాడు, "ఎప్పుడు?"

"నాకు పదకొండేళ్ళప్పుడు."

"ఏం చేసేవారు."

"ప్రొఫెసర్."

"ఉస్మానియాలోనా? నా కెప్పుడూ చెప్పనేలేదే?"

"కాదు. వైజాగ్."

"ఏ సబ్జెక్ట్?"

"ఆర్ట్సు" అని నవ్వి చెప్పింది. "ఇంగ్లీష్ లిటరేచర్."

"అందుకే మీరీ సబ్జెక్టు ఎన్నుకున్నారా?"

"అందుకని కాదు."

కొద్దిసేపాగి రామకృష్ణ అడిగాడు.

"మంగళవారం అసలేం తీసుకోరా?"

"ఉహు, ఉదయం రెండు ఇడ్లీలు, రాత్రి రెండు ఇడ్లీలు, కాఫీ.. అంతే."

"పోయిన వారికోసం సంవత్సరానికో తద్దినం పెట్టి ఊరుకుంటారు చాలామంది. అసలు పోయినవారం, తేదీ గుర్తుండనే ఉండదు చాలామందికి... ఐ థింక్ ఇటీజ్ ఏ సారోఫుల్ వేటూ రిమంబర్ హిమ్, టూ గ్రీవ్ ఫర్ ది డిసీజ్డ్."

"మై ఫాదర్ యు నో హి డయిడ్ ఎట్ సచ్ ఏన్ యంగ్ ఏజ్. హి వజ్ హార్డ్లీ ఫార్టీ. ఐ లవ్ హిమ్. వెరీ మచ్ ఐ ఫెల్ట్ - ఐ మీన్ ఐ రియల్లీ ఫెల్ట్ దట్ ఐ మిస్డు హిమ్.. ఐ హేవ్ బీన్ మిస్సింగ్ హిమ్ ఆల్ ఎలాంగ్"

"మరణించినా ఇంకా మీ ఇంట్లో, మీ గుర్తుల్లో జీవించేవున్నాడాయన. అదృష్టవంతుడు"

ప్రక్కగదిలో - త్రిపురం బెడ్ రూంలో వాళ్ళ తండ్రి ఫోటో. ఆయన వాడిన పైప్. కంఫ్లింక్స్, టై, బూట్లూ, కళ్ళజోడు, పెన్ను, పర్స్ చాలా వస్తువులు ప్రత్యేకంగా చేసిన అద్దాల బీరువాలో ఉన్నాయి.

ఆ సంగతి చెప్పలేదు త్రిపురం. అంతవరకూ కొత్త వాళ్ళెవరూ ఆ డ్రాయింగు రూం దాటి లోపలికి అడుగు పెట్టలేదు. ఎంతమంచి స్నేహితులైనా - ఒక్క బంధువులు తప్ప.

ఆ సంగతి చెపితే రామకృష్ణకి అవి చూపించాలి మర్యాదకైనా. అందుకే ఆ ప్రస్తావన తేలేదు త్రిపురం. అతను లోపలికి రావడం ఇష్టంలేదు త్రిపురానికి.

"మీ అన్నయ్య, అక్కయ్య కూడా మంగళవారం ఫాస్టింగ్ అబ్‌జర్వ్ చేస్తారా?"

"లేదు."

"దట్ ఎంఫసైసెస్ యువర్ ఎటాచ్ మెంట్" అన్నాడు రామకృష్ణ నవ్వి.

రామకృష్ణ వెళ్ళిపోయాక అడిగింది వర్ధనమ్మ.

"బి.ఏ నుంచి నీ క్లాస్‌మేటా?"

"ఊహు"

అతని గురించి పూర్తివివరాలు చెప్పింది తల్లికి.

"తర్వాత ఏం చేస్తాడు?"

"బహుశా డాక్టరేట్‌కి ప్రయత్నిస్తాడు."

"మంచివాడులా కనిపిస్తున్నాడు."

"నిజంగా మంచివాడు. చదువుతప్ప ఇంకేం వ్యసనాలు లేవు."

చిన్నగా నిట్టూర్చింది ఆవిడ. ఖాళీ ట్రేని లోపలికి తీసుకు వెళుతూ, ఆ నిట్టూర్పులో చాలా అర్థాలు స్ఫురించాయి త్రిపురానికి.

"పెళ్ళంటే ఎందుకు తొందరపడతారు వీళ్ళు?" విసుక్కుంది మనసులో.

## 8

త్రిపురం ఆర్ట్సు కాలేజ్ లైబ్రరీకి వెళ్ళింది ఆ ఆదివారం. పరీక్షలు దగ్గిర పడుతున్నందువల్ల ధ్యాసంతా చదువు మీదే ఉంది. కొన్ని రెఫరెన్సు పుస్తకాలు తీసుకుని నోట్సు వ్రాసుకోసాగింది.

రామకృష్ణకూడా కనిపించాడు లైబ్రరీలో, ఏవో పుస్తకాలు తిరగేస్తూ, తన పనిలో నిమగ్నమయిన త్రిపురానికి కాసేపయ్యాక మళ్ళీ చూస్తే కనబడలేదు. వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రెండింటికి ముందు రిసెప్షనులో టోకెన్ ఇచ్చి తనతో తెచ్చుకున్న బేగ్‌ని అందుకుని బయటకి వచ్చింది.

యూనివర్సిటి లైబ్రరీ ఎత్తయిన గుట్టలాంటి దానిమీద కట్టివుంది. ఎదురుగా చూస్తే యూనివర్సిటి గార్డెన్. దాని వెనుక, సరిగ్గా లైబ్రరీకి సూటిగా కనబడుతుంటుంది కాన్ఫరెన్సు హాల్.

బస్‌స్టాప్ వైపు నడవసాగింది.

ఆ రోజు ఆదివారం కాబట్టి పూర్తిగా నిర్మానుష్యంగా ఉంది. ఆర్ట్స్ కాలేజ్ గంభీరంగా నిల్చుని ఉంది దారి ప్రక్కన.

మెయిన్ రోడ్ మీదకి వచ్చింది. సికింద్రాబాద్ వైపు వెళ్ళే బస్టాప్‌లో నిలబడి ఉన్నాడు రామకృష్ణ. దీక్షగా ఏదో చదువుతున్నాడు. నవ్వుకుంది. బస్ కోసం ఎదురు చూస్తూ తను చేసే పని కూడా అదే. తనని చూసి కూడా అలాగే నవ్వుకుంటారా అంతా, చదువుకుంటుంటే,

రామకృష్ణకి దూరంగా నిలబడి గమనించింది అతన్ని. సన్నగా పలచగా ఉంటాడు. కళ్ళజోడు. దాని ఫ్రేమ్ షెల్‌తో చేసిందట. ఓసారి మాటల్లో చెప్పాడు. షార్టు సైట్.

బాగా పెరిగిన గడ్డం. మీసాలు ఫేషన్ కామోసు. ఎప్పుడూ టక్ చేసుకుంటాడు. నీలంరంగు డెనిమ్ కాటన్ పాంటులోకి తెల్లటి కాటన్ షర్టు టక్ చేసుకున్నాడు. ఎడం భుజాన ఓ సంచి వ్రేలాడుతోంది. కుడిచేతి మణికట్టుకి వాచ్, ఎడం చేతి మణికట్టుకి ఓ వెండి కడియం.

అతనితో ఓ పావుగంట మాట్లాడితే 'మంచివాడు' అనే భావం కలుగుతుంది. కాని అతని ఆకారం చూస్తే పోస్టు గ్రాడ్యుయేట్ చదువుతో, కేవలం చదువంటేనే ఇష్టపడే వ్యక్తిగా అనిపించడు.

"నాక్కావల్సిందేంటి? నా జీవిత భాగస్వామ్యంలో ఎవరిని చూసుకుంటాను?"

మొదటిసారిగా ఆ నిశ్శబ్ద వాతావరణంలో తనని తాను ప్రశ్నించుకుంది త్రిపురం.

"మంచివాడై, విద్యావంతుడై ఉంటే చాలు"

"అందగాడై ఉండాలా?"

మగాడిలో తను అందంకన్నా సానుభూతి, అర్థం చేసుకునే సంస్కారం, ఆసరాగా నిలిచే వ్యక్తిత్వం కోరుకుంటుంది.

వీటన్నిటికీ జవాబుగా నిల్చిన వ్యక్తి దొరికితే పెళ్ళిని వాయిదా వేయటం దేనికి?

త్రిపురం రామకృష్ణ దగ్గరకి వెళ్ళింది పలకరిద్దామని.

ఉలిక్కిపడింది వెంటనే. రామకృష్ణ తూలుతున్నాడు.

చేతిలోని పుస్తకం బిగుసుకుపోయింది!

నోట్లోంచి కొద్దికొద్దిగా నురుగలు వస్తున్నాయి!

త్రిపురం చూస్తుండగానే క్రిందపడబోయాడు. అప్రయత్నంగా అతన్ని పట్టుకుంది నేలమీద పడకుండా. కళ్ళుమూసుకున్నాడు. మూలుగుతున్నాడు. అది మూలుగు కూడా కాదు. విచిత్రమయిన ధ్వని.

త్రిపురానికి అయోమయంగా ఉంది. భయం వేస్తోంది. అతని పేంట్ జేబుకున్న ఫ్రంట్ పాకెట్ లోంచి కర్చీఫ్ తీసి నోట్లోంచి వస్తున్న నురుగును తుడుస్తూ, చుట్టుప్రక్కల చూసింది సహాయానికి.

హాస్టల్‌లో ఉండే విద్యార్థులు ఇద్దరు ఎదురుగా రోడ్డుకి అవతలి వైపువున్న గట్టుమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. త్రిపురం గట్టిగా అరిచింది.

"హెల్ప్, హెల్ప్, కమ్ హియర్ క్విక్."

"రాస్కేల్, వదులు" ఒకడు వెనక్కి తిరిగి చూసి అరుస్తూ లేచాడు.

క్షణాల్లో ఇద్దరూ వచ్చారు.

"అరరె! ఏమైంది?" నాలిక కొరుక్కుని అడిగాడా విద్యార్థి.

"ఏమో, చేతులు చూడండి ఎలా బిగుసుకుపోయాయో!"

"హిస్టీరియాలా గుంది. స్మెల్లింగ్ సాల్టు వాసన చూపించాలి" చెప్పాడు రెండో విద్యార్థి.

"ఆటో.." కేకేసాడు మొదటి వ్యక్తి.

దూరంగా ఆగివున్న ఆటో రాగానే, "ఆస్పత్రికి  తీసుకు వెళ్ళటం మంచిది" అన్నాడు.

ఇద్దరూ సాయం పట్టి ఆటోలోకి చేర్చారు రామకృష్ణని.

"రండి" అన్నాడు ఒకడు ఆటోలో ఎక్కి.

త్రిపురం ఎక్కింది. రామకృష్ణ నోటివెంట నురగ కారుతోంది. రెండు చేతులూ బిగుసుకుపోయాయి. అతను చేతులను సాగదీసి, గుప్పిటలా మూసుకున్న వేళ్ళను విడదీసే ప్రయత్నం చేస్తున్నాడు.

సీతాఫల్‌మండిలోని ఓ ఆస్పత్రి ముందు ఆపించాడతను ఆటోని. లోపలకి తీసుకువెళ్ళాడు డ్రయివర్ సాయం పడితే.

✷✷✷

*(ఇంకావుంది)*

ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library

**NEW ** Click here to Post Comments on this article